# ఆరోగ్య యోగం



బాచుపల్లిలోని వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి స్కూల్‌లో విద్యార్థులకు యోగాపై అవగాహన



## ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం

అంతర్జాతీయ యోగా దినోత్సవం శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలు, సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో యోగాసనాల ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని యోగాసనాలు వేశారు. ప్రపంచానికి యోగాను అందించిన ఘనత మన భారతదేశానిదని వక్తలు అన్నారు. ప్రతి ఒక్కరూ యోగాను అభ్యసించాలన్నారు. ప్రతిరోజు యోగాసనాలు వేసి ఆరోగ్యంగా ఉండాలని యోగా గురువులు కోరారు. - కుత్బుల్లాపూర్



టీవీఆర్ మోడల్ హైస్కూల్‌లో యోగ వేడుకలు



బాచుపల్లిలో యోగాలో పాల్గొన్న విద్యార్థులు



సుభాష్‌నగర్‌లోని బోధివృక్షా ఒలంపియాడ్ స్కూల్‌లో..



టెక్సాస్ ఇంటర్నేషనల్ అకాడమీలో..






కొంపల్లిలో యోగాలో భాగంగా..




షాపూర్‌నగర్‌లో జరిగిన యోగా వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్



సూరారం నార్త్ సిటీ హైస్కూల్‌లో..



గాజులరామారం శ్రీనిధి గ్లోబెల్ స్కూల్‌లో..



సుచిత్రలో జరిగిన యోగా వేడుకల్లో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్



ప్రగతినగర్‌లో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

## కార్మికుల హక్కులను కాపాడేందుకు కృషి చేస్తా

దుండిగల్: కార్మికల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి హక్కులను కాపాడే విధంగా కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేత కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. డి.పోచంపల్లి సారెగూడెంలోని ఆల్కాలిక్ మెటల్స్ పరిశ్రమ గేట్ మీటింగ్ శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ... కంపెనీ ఉద్యోగుల సంక్షేమానికి తాను ఎల్లప్పుడు కృషి చేస్తానన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి యాజమాన్యంతో చర్చిస్తానన్నారు. సోమవారం జరిగే యూనియన్ ఎన్నికల్లో అధ్యక్ష అభ్యర్థి ఎం.రాముగౌడ్ ప్యానల్‌ను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్‌చైర్మన్ బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమామాధవరెడ్డి, ఉద్యోగులు, కార్మికులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

## నీట్ పరీక్ష లీకేజీలపై సమగ్ర విచారణ చేపట్టాలి



ఐడీపీఎల్ చౌరస్తాలో నిరసన తెలుపుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

రంగారెడ్డినగర్: నీట్ పరీక్ష లీకేజీలపై సమగ్ర విచారణ చేపట్టి రీ ఎగ్జామ్ నిర్వహించాలని, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ)ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కార్తీక్ అన్నారు. శుక్రవారం నీట్ ప్రశ్నా పత్రం లీకేజీపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఐడీపీఎల్ చౌరస్తాలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా కార్తీక్ మాట్లాడుతూ.. ఎన్టీఏ అసమర్థతతో నీట్, జీయూఈటీ, యుజీసీ నెట్ పరీక్షల్లో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. దీంతో కష్టపడి చదవిన విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. నీట్ పరీక్ష ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంలో బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో కేంద్ర విద్యాశాఖ విఫలమైందని ఆరోపించారు. దీనికి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఎన్టీఏను రద్దు చేసి స్థానిక ప్రభుత్వాల ద్వారా పరీక్షలు రాసే పద్ధతిని అమలులోకి తీసుకురావాలన్నారు. నీట్ వైఫల్యాలపై కేంద్ర ప్రభుత్వం స్పందించకుంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహిస్తామని హెచ్చరించారు.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: విద్యుత్ ఫీడర్ల నిర్వహణ నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తనుందని పేట్‌బషీరాబాద్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ జీడిమెట్ల ఫీడర్ పరిధిలోని భీమా ప్రైడ్, జీడిమెట్ల గ్రామం, పిస్తాహౌజ్ లేన్, ఆర్టీఏ కార్యాలయ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 9.30గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

### గుర్తు తెలియని వృద్ధుడు మృతి

దుండిగల్: గుర్తు తెలియని వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వారంరోజుల క్రితం మల్లంపేట ఔటర్ రింగ్ రోడ్డు వద్ద ఓ గుర్తు తెలియని వృద్ధుడు ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే నీరసంగా ఉన్న వృద్ధుడిని పోలీసులు దుండిగల్‌లోని అరుంధతి ఆస్పత్రిలో చేర్పించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న వృద్ధుడు గురువారం మృతిచెందాడు. మృతుడి సంబంధీకులు ఎవరైనా ఉంటే దుండిగల్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

### ప్రమాదకరంగా మ్యాన్‌హోల్



నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సాయినగర్‌లో మూతలు లేని డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు ప్రమాదభరితంగా మారాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే మ్యాన్‌హోల్ మూతలు ఏర్పాటు చేసి ప్రమాదాలను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రొ. జయశంకర్ గొప్ప పోరాట యోధుడు



రామకృష్ణనగర్‌లో ప్రొ.జయశంకర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నందిపేట రవీందర్

కుత్బుల్లాపూర్: ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని రామకృష్ణనగర్‌లో నిర్వహించారు. రాష్ట్ర విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ ఐక్య సంఘం ప్రధాన కార్యదర్శి నందిపేట రవీందర్ ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. జయశంకర్ సార్ విద్యార్థి దశ నుంచే తెలంగాణ రాష్ట్ర సాధన కోసం తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. ప్రొ. జయశంకర్ సారు గొప్ప పోరాట యోధుడు అని కొనియాడారు. ప్రజాస్వామ్య స్ఫూర్తితో అనేక రకాల ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. కార్యక్రమంలో సంఘం నాయకులు పి.బాలరాజ్, పి.ఉపేందర్, గురుమూర్తి, నర్సింహ, బాలాచారి. అంబరీషచారి, మల్లాచారి తదితరులు పాల్గొన్నారు.

**ఉద్యమ రథసారథి ప్రొ.జయశంకర్**

జగద్గిరిగుట్ట: తెలంగాణ ఉద్యమ రథసారథి ప్రొ. జయశంకర్ వర్ధంతి శుక్రవారం జగద్గిరిగుట్ట అవుట్ పోస్ట్ వద్ద నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి కార్పొరేటర్ జగన్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రొ. జయశంకర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

**ప్రొ. జయశంకర్ సార్ సేవలు మరువలేనివి**

నిజాంపేట్: ఆరు దశాబ్దాల తెలంగాణ ప్రజల ఆకాంక్ష అయిన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం తుదిశ్వాస వరకు పోరాడిన మహాయోధుడు ప్రొ. జయశంకర్ సార్ అని నిజాంపేట్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ధనరాజ్‌యాదవ్ అన్నారు. నిజాంపేట్ రాజీవ్ గృహకల్పలో శుక్రవారం ప్రొ. జయశంకర్ సార్ వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి డిప్యూటీ మేయర్ ధనరాజ్, కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రంగరాయ ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు.

◆ ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తెలుగు, ఉర్దూ, హిందీ, ఇంగ్లిషు భాషల్లో జయశంకర్ సార్‌కు మంచి ప్రావీణ్యం ఉందన్నారు. తెలంగాణ ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేసి ఆజన్మ బ్రహ్మచారిగా జీవించారని తెలిపారు. 1969 తెలంగాణ ఉద్యమంలోనూ, అంతకు ముందు నాన్ ముల్కీ ఉద్యమంలో, సాంబార్ – ఇడ్లీ గోబ్యాక్ ఉద్యమంలో ఆయన పాల్గొన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన సేవలను రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ మరువరన్నారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భిక్షపతి, ముత్యాలు, దశరథ్, ఖలీల్, చుక్క వెంకటేష్, శ్రీను, తొంటా చందు, నర్మదా, స్వర్ణ కుమారి, సరస్వతి, మంజుల, వెంకటమ్మ, అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ జగన్



ప్రొ. జయశంకర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్

# మల్కాజ్‌గిరి ప్రజలకు రుణపడి ఉంటా

**ఎంపీ ఈటల రాజేందర్**



ఎంపీ ఈటల రాజేందర్‌కు గొర్రె పిల్లలను అందజేస్తున్న అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్‌యాదవ్

కుత్బుల్లాపూర్: ప్రజల ఆదరణతోనే కేంద్రంలో బీజేపీ మూడోసారి అధికారంలోని వచ్చిందని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం షాపూర్‌నగర్‌లోని ఎంజీఎస్ ఫంక్షన్ హాల్‌లో బీజేపీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కన్వీనర్ జేకే శేఖర్‌యాదవ్ ఆధ్వర్యంలో ఈటల రాజేందర్‌కు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయనకు గొర్రె పిల్లను అందజేసి సత్కరించారు. అనంతరం ఈటల మాట్లాడుతూ.. నాలుగు లక్షల మెజార్టీతో తనను పార్లమెంట్‌కు పంపించిన మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానన్నారు. 240 సీట్లు సాధించి మూడు పార్టీలతో అధికారం సొంత చేసుకున్న బీజేపీ ఎక్కడ... 99 సీట్లు సాధించి పదుల సంఖ్యలో కూటమిగా ఏర్పడిన కాంగ్రెస్ ఎక్కడ అని హేళన చేశారు. ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో అమలు పరిచిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలే బీజేపీకి హ్యాట్రిక్ విజయాన్ని సాధించి పెట్టాయన్నారు.

**తెలంగాణ ఎవరి జాగీరు కాదు...**

◆ తెలంగాణాలో అధికార కాంగ్రెస్ పార్టీ డబ్బు, మద్యం పంపిణీ చేసినా ప్రజలు నమ్మలేదని అత్యధికంగా బీజేపీ ఎంపీలను గెలిపించారన్నారు. సంకీర్ణ రాజకీయాల కాలంలో ఎవరూ ఎప్పుడు పార్టీ మారతారో తెలియని ఈ కాలంలో ప్రజలు ప్రధాని మోదీకి మరోసారి అవకాశం ఇచ్చారన్నారు. ఏ రాష్ట్రం కూడా ఎవరి జాగీరు కాదని ఎప్పటికీ ప్రజలదే ప్రభుత్వమన్నారు. తన మీద నమ్మకంతో ప్రజలు ఓట్లు వేసి గెలిపించారని అన్నారు. ప్రజల కాళ్లకు ముళ్లు గుచ్చుకుంటే పంటితో తీస్తానన్నారు.

**గతంలో గెలిచిన ఎంపీ ఇక్కడ ఎప్పుడూ కనిపించలేదు...**

◆ మల్కాజిగిరిలో గతంలో ఎంపీగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇక్కడ ఎప్పుడూ కనిపించలేదని విమర్శించారు. అందుకే ప్రజలు కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ఓటు వేశారన్నారు. తెలంగాణకు కావాల్సిన సమస్త సదుపాయాలను కేంద్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు శాయశక్తులా కృషి చేస్తాన్నారు. రాష్ట్రంలో ఆరు గ్యారంటీలు అమలు కావడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల హామీలను నెరవేర్చాలన్నారు. లేకుండా అతితక్కువ కాలంలో ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిన ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోతారన్నారు. ప్రజలు తనకు ఇచ్చిన అధికారాన్ని ప్రజా సమస్యల పరిష్కారానికి వినియోగిస్తానన్నారు.

◆ ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు మల్లారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్‌రెడ్డి, కార్పొరేటర్లు రావుల శేషగిరి, విజయలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు బక్క శంకర్ రెడ్డి, గరిక శేఖర్, బావిగడ్డ రవి, జిల్లా కార్యదర్శి భరతసింహారెడ్డి, కౌన్సిలర్లు రాజిరెడ్డి, సుబ్బారావు, ఆంజనేయులు, చండీ శ్రీనివాస్, పత్తి రఘుపతి, ఎంఎస్ వాసు, సదానందం, డివిజన్ల అధ్యక్షులు భానుచందర్, దారం సాయి తదితరులు పాల్గొన్నారు.

## స్పందించారు.. వ్యర్థాలు తొలగించారు

జీడిమెట్ల: 'గత తప్పిదాలను గుర్తెరగండి, వ్యర్థాలను తొలగించండి'అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి జీహెచ్ఎంసీ అధికారులు స్పందించారు. సుభాష్‌నగర్ డివిజన్ వెంకటాద్రినగర్ కాలనీలో ఉన్న నాలాలో పేరుకు పోయిన వ్యర్థాలను శుక్రవారం తొలగించారు. అధికారులు వ్యర్థాలను తొలగించడం పట్ల కాలనీవాసులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.


గత తప్పిదాలను గుర్తెరగండి
వ్యర్థాలను తొలగించండి

'సాక్షి'లో ప్రచురితమైన కథనం




## 'దానం నాగేందర్'వి చిల్లర మాటలు

**కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్**



కుత్బుల్లాపూర్: ప్యాకేజీ తీసుకుని పార్టీ మారిన దానం నాగేందర్ మంత్రి పదవి ఆశతో చిల్లర మాటలు మాట్లాడుతున్నాడని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. బీఆర్ఎస్‌కు చెందిన 20 మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని, అందులో తన పేరు ప్రస్తావన తేవడం ఆశ్చర్యాన్ని కలిగించిందన్నారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ లాగా తాను అమ్ముడుపోయే పరిస్థితిలో లేనన్నారు. తమ పార్టీ ఎమ్మెల్యేలు కూడా లేరని ఘాటుగా విమర్శించారు. పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యేగా తిరిగి పోటీ చేయాలని, మంత్రి పదవి ఆశతో పార్టీ మారిన నాగేందర్ గొప్పలకు పోయి గ్రేటర్ పరిధిలో ఉన్న ఎమ్మెల్యేలపై పెత్తనం చేయడం తగదన్నారు. ఇప్పటికైనా దానం చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్‌లోనే కొనసాగుతూ ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామని వివేకానంద్ స్పష్టం చేశారు.

## శాంతిభద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదు

**మేడ్చల్ డీసీపీ ఎన్. కోటిరెడ్డి**



కుత్బుల్లాపూర్: మేడ్చల్ డీసీపీగా ఎన్. కోటిరెడ్డి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన రితిక పంత్ కమాండ్–2 బెటాలియన్ ఆదిలాబాద్‌కు బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో వికారాబాద్ ఎస్పీగా పని చేస్తున్న కోటిరెడ్డి ఇక్కడికి బదిలీపై వచ్చారు. రెండు రోజుల క్రితం బదిలీల ఉత్తర్వులు రావడంతో బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా కోటిరెడ్డి 'సాక్షి'తో మాట్లాడుతూ.. శాంతిభద్రతల విషయంలో రాజీ పడే ప్రసక్తే లేదన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచి కట్టడి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం డీసీపీ పరిధిలో ఉన్న ఏసీపీలు, సీఐలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి స్థానికంగా ఉన్న కేసుల విషయాలపై ఆరా తీశారు. ఇదే క్రమంలో గురువారం మేడ్చల్‌లో జరిగిన బంగారం దుకాణం దొంగల విషయంపై ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి నిందితులను పట్టుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే నాలుగు బృందాలు వివిధ ప్రాంతాల్లో జల్లెడ పడుతున్నాయి.

## బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పించాలి

**బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరే మహేందర్**



కుత్బుల్లాపూర్: దేశ జనాభాలో 60 శాతం ఉన్న బీసీలకు కేంద్రంలో ఒక ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయలేకపోతున్నారని.. బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చినా కూడా బీసీలను విస్మరిస్తోందని బీసీ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఆరే మహేందర్ అన్నారు. కొంపల్లిలోని బీసీ ఐక్యవేదిక కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. దీనికి దేశంలోని అన్ని రాజకీయ పార్టీలను ఒప్పించి బీసీ బిల్లును ఆమోదింపజేయాలని అన్నారు. తెలంగాణలో కూడా బీసీలకు ప్రత్యేక సబ్ ప్లాన్ ఏర్పాటు చేసి ప్రతి సంవత్సరం రూ.20వేల కోట్ల బడ్జెట్ పెట్టాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం నియమించనున్న నామినేటెడ్ పదవుల్లో బీసీలకు 50 శాతం ఇవ్వాలన్నారు. స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఐక్యవేదిక రాష్ట్ర కోఆర్డినేటర్ దశరథం, గ్రేటర్ హైదరాబాద్ కన్వీనర్ రంగు క్రాంతిగౌడ్, ప్రధాన కార్యదర్శి రాజేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు దాదా అభిషేక్ పాల్గొన్నారు.



## దశల వారీగా అభివృద్ధి పనులు



బోరును ప్రారంభిస్తున్న కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి

దుండిగల్: కాంగ్రెస్ ప్రభుత్వం దశల వారీగా అభివృద్ధి పనులు చేస్తుందని కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. బౌరంపేటలో లక్ష్మీనగర్, మసీద్ ప్రాంతాల్లో నీటి సమస్యను తొలగించాలని స్థానికులు ఆయనకు వివరించారు. దీనిపై స్పందించిన హన్మంత్‌రెడ్డి ఈ విషయాన్ని మంత్రి శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన వెంటనే స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కింద రూ.5లక్షలను మంజూరు చేయించారు. ఆ నిధులతో నూతనంగా వేసిన రెండు బోర్లను శుక్రవారం హన్మంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ జాయింట్ సెక్రటరీ పోలీస్ జీవేందర్‌రెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ బెంబడి మల్లారెడ్డి, నేతలు సల్మాన్‌రాజ్, చింతకింది నారాయణ, సిద్దనోళ్ల సంజీవ్‌రెడ్డి, పెరిక శివ, నర్సింగ్‌రావు, రాజు, వెంకటేశ్, షరీఫ్, గౌస్, నయూమ్, రాజు, మధులత, కమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మర్ చెరువు స్థలాన్ని పరిరక్షించాలి



సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపాలిటీ దూలపల్లిలోని తుమ్మర్ చెరువు శిఖం స్థలాన్ని మట్టితో పూడుస్తున్నారని, చెరువు స్థలాన్ని పరిరక్షించాలని గ్రామస్తుడు గడ్డం ప్రసన్నకుమార్ శుక్రవారం ప్రజాభవన్‌లో ఫిర్యాదు చేశారు. రెండు రోజుల నుంచి చర్మాస్ కంపెనీ వెళ్లే దారిలో చెరువు శిఖం భూమిని పూడుస్తున్నారని తెలిపారు. ఎగవ భాగాన ఇప్పటికే శిఖం స్థలాన్ని 10ఎకరాల మేర పూడ్చారని పేర్కొన్నారు. చెరువు దిగువ భాగాన కట్టు కాలువ సైతం కబ్జా చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మరోవైపు మల్లారెడ్డి కళాశాల నుంచి వచ్చే మురుగు చెరువులో కలవడంతో కాలుష్యంగా మారిందన్నారు. తాజాగా రెండు రోజుల నుండి పెద్ద పెద్ద టిప్పర్లతో మట్టి, బండ రాళ్లతో నాలా భాగాన్ని పూడ్చివేస్తున్నారని తెలిపారు. ఈ విషయం స్థానిక మున్సిపల్, ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదని ప్రసాద్ వాపోయారు. పచ్చని పంట పొలాల మధ్య కళకళలాడే తూమర్ చెరువు ప్రస్తుతం ఆనవాళ్లు కోల్పోయిందన్నారు. ఇకనైనా చర్యలు తీసుకొని చెరువుకు పూర్వ వైభవం తీసుకరావాలని వినతిలో కోరారు.